

# లిటిల్ రాస్కెల్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

"ఇటీజ్ సో సింపుల్. ప్లీజ్ జాయిన్ అజ్ సహజ ఆంటీ, పిన్ని మీరు కూడా" చెప్పాడు రాజేష్ ఉత్సాహంగా.

ఆ ఏడుగురు ఒకరి పక్కన మరొకరు గుండ్రంగా కూర్చున్నారు.

"నేను ఒన్, టూ, త్రీ చెప్పగానే మనమంతా రెండు చేతులని గుప్పిటగా మూయడమో లేదా అలాగే తెరచి వుంచడమో చేయాలి. నేను సింహాన్ని. మిగతా మీరంతా నన్ను చంపడానికి వచ్చిన వేటగాళ్ళు. ఒన్, టూ, త్రీ చెప్పాక గుప్పిట మూస్తే అలా మూసినవాళ్ళంతా నాని మీద బాణం వేసి మిస్ అయ్యారన్నమాట. వాళ్ళు ఆటలో అవుట్ అవుతారు. మిగతావాళ్ళు ఆటలో వుంటారు. ఒకవేళ నేను గుప్పిట ముయ్యకపోతే అలా నాతో కూర్చుని వాళ్ళు ఓడిపోతారన్నమాట. చివరికి ఒక్కరే మిగిలితే వాళ్ళు గెలిచినట్లు. వాళ్ళు బాణం వేసి నన్ను చంపే వేటగాళ్ళన్నమాట. అసలు ఎవరూ మిగలకపోతే సింహం గెలుస్తుంది. అర్థమైందా?" అడిగాడు.

"ఈ ఆట మీ అమ్మ నేర్పిందికదూ?" అడిగింది నీరజ వెంటనే.

"అవును. స్కూల్లో పిల్లలు పాఠాలు వినకుండా ఎప్పుడైనా గొడవ చేస్తే వాళ్ళచేత ఈ ఆట ఆడిస్తుంది ఓ పీరియడంతా. ఎలా ఆడాలో అర్థమైందా? మళ్ళీ చెప్పనా పిన్నీ?" అడిగాడు.

"అర్థమైంది."

"గుడ్ ఎవ్విరిబడీ ప్లీజ్ బి రెడీ. ఐ యామ్ ది లయన్. ఒన్ టూ, త్రీ."

ఒన్, టూ త్రీ వేగంగా చెప్పి అలాగే గుప్పిట ముయ్యకుండా తన చేతుల్ని తెరచి వుంచాడు. ఆరుగురిలో ఇద్దరు గుప్పిట మూసారు. సహజ ముందర మూసి, తర్వాత రాజేష్ చేతులవంక చూసి వెంటనే తెరిచింది అది రాజేష్ గమనించలేదు.

"వేటగాళ్ళూ, మీరిద్దరూ అవుట్. మీ బాణాలు నాకు తగల్లేదు" వాళ్ళతో నవ్వుతూ చెప్పాడు రాజేష్.

వాళ్ళు చేతులు వెనక్కి పెట్టేసుకున్నారు.

"మా బాణాలు?" అడిగింది జయంతి.

"మీరసలు బాణాలే వెయ్యలేదన్నమాట. నౌ గెట్ రెడీ అగైన్. ఒన్...టూ.....త్రీ"

ఒన్, టూ, త్రీ అని ఆగి చెప్పాడు రాజేష్. ఈసారి గుప్పిట మూసాడు. నీరజ, మరో అమ్మాయి గుప్పిట మూసారు. సహజ ముందు ముయ్యలేదు. రాజేష్ చేతులవంక చూసి తర్వాత మూసింది. అది గమనించాడు రాజేష్. "డోంట్ ఛీట్ ఆంటీ, మీరు అవుట్. మీ ఇద్దరు కూడా" చెప్పాడు వాళ్ళతో

జయంతి మాత్రం మిగిలింది.

"మీరు జాగ్రత్తగా ఆడండి ఆంటీ ఒన్....టూ...త్రీ" చెప్పాడు రాజేష్.

రాజేష్ గుప్పిట మూసాడు, జయంతి గుప్పిట ముయ్యలేదు. తమ చేతులని పోల్చి చూసుకున్న రాజేష్ 'ఓ' అని కెవ్వున అరిచి వెనక్కి వాలిపోయాడు.

"ఏమైంది?" అందరికన్నా ముందు అడిగింది నీరజ. ఆమె గుండె క్షణకాలం కొట్టుకోవడం ఆగింది.

"ఏంలేదు పిన్నీ, నేను ఓడిపోయాను. వేటగాడి బాణం నాకు తగిలిందన్నమాట" చెప్పాడు రాజేష్ నవ్వుతూ కూర్చుని.

"మంచి టైంపాస్ ఆట" చెప్పింది ఓ అమ్మాయి.

"ఈసారి హాస్టల్ ఏన్యువల్ డే రోజు పార్టీ గేమ్స్‌లో దీన్ని ఇంక్లూడ్ చేద్దాం" చెప్పింది మరో అమ్మాయి.

"నేను నిన్ను చంపినట్లా?" అడిగింది జయంతి రాజేష్‌ని.

"అవును. మన చేతులు మేచ్ అవుతే, అంటే నేను గుప్పిటముయ్యగానే మీరు మూసివుంటే మీ బాణం మిస్ అయిందన్నమాట. అప్పుడు సింహం మిమ్మల్ని చంపేస్తుంది. కాబట్టి మీరు ఓడిపోయినట్లు. కానీ నేను గుప్పిట మూస్తే మీరు ముయ్యలేదుగా? సో, నేను ఓడిపోయినట్లు"

"నేను చిన్నపిల్లల్ని చంపను" నవ్వుతూ చెప్పింది జయంతి.

"నన్నుకాదు, ఆటలో సింహాన్ని."

"మీ అమ్మ పేరేమిటి?" అడిగింది జయంతి.

"సావిత్రి" చెప్పాడు.

"నాన్నగారి పేరు?"

నీరజ రాజేష్ వంక చూసింది. రాజేష్ కూడా నీరజ వంక చూశాడు.

"కె.ఎస్.రావుగారు" కాస్సేపు మధనపడి చెప్పాడు.

"ఏం చేస్తారు?"

"ఉద్యోగం"

"ఏం ఉద్యోగం?"

"నాకు తెలీదు."

"నీకు తమ్ముళ్ళుకానీ, అక్కలు కానీ ఎవరైనా వున్నారా?"

"ఉహూ"

"నాకూ ఇలాంటి కొడుకుంటే బావుండేదనిపిస్తోంది" చెప్పింది జయంతి.

"కొడుకులంతా ఒకటే. కొడుకుని 'ఇలాంటి కొడుకు'గా మలచుకోవడంలోనే వుంది" చెప్పింది నీరజ వెంటనే.

"థాంక్యూ పిన్నీ."

"దేనికి?" అడిగింది సహజ.

"మా అమ్మని మెచ్చుకున్నందుకు. అమ్మ ఇక్కడ లేదుగా. అందుకని నేనే థాంక్స్ చెప్పాను."

"గుడ్ మానర్స్ మై లిటిల్ బాయ్, ఐ లైక్ యూ" చెప్పింది జయంతి రాజేష్ ముక్కుని సరదాగా పిండి.

మళ్ళీ ఆట మొదలుపెట్టారు. ఈసారి సహజ ఆటలో చేరలేదు. అలమారాలో వున్న దినపత్రికని అందుకుని వాటిని జాగ్రత్తగా తిరగేయడం నీరజ గమనించింది.

ఈసారి రాజేష్ గెలిచాడు.

నీరజ ఆట అవగానే లేచి వెళ్ళి అడిగింది.

"ఏమిటి వెదుకుతున్నావ్?"

"సావిత్రి రాజేష్‌ని రైలు ఎక్కించిన మర్నాటినుంచీ ఈరోజు దాకా పేపర్లు తిరగేస్తున్నాను" చెప్పింది సహజ.

"దేనికి?"

కొన్ని క్షణాలు తటపటాయించి చెప్పింది.

"మే గాడ్ ఫర్ బిడ్ ఇట్. ఒకవేళ ఆమె ఏ ఆత్మహత్యో చేసుకుందేమోనని. రెండు ఆత్మహత్య కేసులు పేపర్లో వేశారు. కానీ వాళ్ళు ఒకరు మొగ, మరొకరు ప్రేమలో విఫలమయిన ఇరవై రెండేళ్ళ అవివాహిత.

"థాంక్ గాడ్ కనీసం సావిత్రి బ్రతికివుంటే చాలు."

దూరంగా కూర్చుని 'సింహం వేటగాడు' ఆడుతున్న రాజేష్ వంక చూసి చెప్పింది సహజ.

"ఎవరినైనా ఇట్టే ఆకట్టుకోగల లక్షణం వుంది రాజేష్‌లో. ఐ లైక్ హిమ్"

"ఎంత వద్దనుకున్నా నాకు రాజేష్ అంటే ఇష్టం ఏర్పడుతోంది" నెమ్మదిగా చెప్పింది నీరజ.

"ఎందుకు వద్దనుకోవటం?" ఆశ్చర్యంగా అడిగింది సహజ.

నీరజ అన్న మాటలు సహజకి సరిగ్గా వినపడలేదు వినబడకుండా, గొణిగింది కాబట్టి.

రాత్రి పది అవగానే అమ్మాయిలంతా ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

రాజేష్ పరుపు వద్దన్నాడు. తాము చాపలు పరుచుకోవడం చూసి మొహమాటపడుతున్నాడనుకుని చెప్పింది సహజ.

"ఫర్వాలేదు."

"అబ్బే, పరుపు వద్దండి" చెప్పాడు మళ్ళీ.

"అది లేకపోతే ప్లాస్టిక్ నవారు గుచ్చుకుంటుంది" చెప్పింది సహజ.

"ఫర్వాలేదండి"

"వేసుకో - ఫర్వాలేదు" చెప్పింది నీరజ రాజేష్ మొహమాటం చూసి.

"అనవసరంగా ఈ పరుపు పాడయిపోతుందేమోనని"

"పడుకుంటే ఒక్క పూటలో ఏం పాడవదులే" చెప్పింది.

"రాత్రి పక్క తడిచేస్తానండి" సిగ్గుగా చెప్పాడు రాజేష్.

ఆ తర్వాత ఎలాంటి చర్చ ఆ విషయం మీద జరగలేదు.

నీరజకి నిద్రపట్టలేదు. ప్రశాంతంగా ఆలోచించసాగింది. మర్నాడు సావిత్రిని కనుక్కోడానికి చేయాల్సిన ప్రయత్నాల గురించి. మాయమైన వాళ్ళని కనుక్కోవాలంటే ఏం చేయాలి?

వెంటనే పోలీసులు గుర్తొచ్చారు. కానీ, ఏమని రిపోర్ట్ యిస్తుంది? వాళ్ళు అడిగే సవాలక్ష ప్రశ్నలకి తన దగ్గర వాళ్ళు నమ్మే సమాధానాలు వుండకపోవచ్చు. ఆ పని చేయకూడదని నిశ్చయించుకుంది.

రాజేష్ లేచివచ్చి తన పక్కన కూర్చోవడం గమనించింది నీరజ.

"ఏమిటి?" వాత్సల్యంగా అడిగింది.

"మా అమ్మ ఎక్కడుంది?" అడిగాడు.

"వస్తుంది"

"ఎప్పుడొస్తుంది?"

"ఇంకో వారం రోజుల్లో"

"నన్ను తీసుకెళ్ళకుండా ఇల్లు ఖాళీచేసేసి, నాతో చెప్పకుండా ఎక్కడికి వెళ్ళింది?"

నీరజకి ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు.

"అసలు ఎందుకిలా చేసింది?"

రాజేష్ కంఠస్వరం పట్టి ఇంకో కొన్ని క్షణాల్లో ఏడుస్తాడని గ్రహించింది నీరజ. వాడి భుజాల్ని చిన్నగా తట్టింది.

"నేనెప్పుడైనా టింకూని అలా వదిలేస్తానా?" అడిగాడు.

"ఉహూఁ."

"మరి అమ్మ నన్నెందుకిలా..." దుఃఖంతో రాజేష్ కంఠం పూడుకుపోయింది.

"నీకు సింహం కుందేలు కథ చెప్పనా?"

కళ్ళలోంచి నీళ్ళు జలజలా కారుతుంటే, ఏడుపు శబ్దం బయటికిరాకుండా రాజేష్ పెదవులని నొక్కిపట్టాడు.

నీరజ లేచి కూర్చుంది. రాజేష్‌ని ఎలా ఓదార్చాలో తెలియలేదు. ఇలాంటప్పుడు సావిత్రయితే ఏం చేసి వుండేది?

కొన్ని క్షణాలు సందేహించింది. అంతరాత్మ ఒప్పుకోలేదు. అంతరంగం వద్దంది. కేవలం కొన్ని క్షణాలే.

రాజేష్‌ని రెండుచేతులతో దగ్గరగా తీసుకుని గాఢంగా హత్తుకుంది. వెంటనే రాజేష్ విడిపించుకుని దూరంగా జరిగాడు. నీరజ ప్రశ్నార్థకంగా చూడటంతో చెప్పాడు లేచి నిలబడి

"మీరు మా అమ్మ కాదుగా."

నీరజ మనసు చివుక్కుమంది. రాజేష్ వెళ్ళి నిశ్శబ్దంగా మంచం మీద పడుకున్నాడు.

ప్రేమకి ముఖ్యంగా, తల్లికి ప్రత్యామ్నాయం వుండదు. రాజేష్ నిద్రపోయేదాకా బయటికి నెమ్మదిగా 'శ్రీరామ శ్రీరామ శ్రీరామ' అని జపం చేయడం వింటూనే వుంది.

ఆ హాస్టల్లో అందరికన్నా ఆఖరున పడుకుంది నీరజ కాదు.

గుండెలో రగిలే మంటల్ని ఆర్పుకునే ప్రయత్నం చేసే మరొకరు.

## 10

మర్నాడు ఉదయం నీరజ రాజేష్‌ని హాస్టల్లోనే సహజని తోడుగా వుంచి హనుమాన్ పేటలో సావిత్రి అద్దెకున్న ఇంటికెళ్ళింది. ఇంటావిడని అడిగి సావిత్రి దగ్గర ట్యూషన్స్ చెప్పించుకోవడానికి వచ్చే పిల్లల ఇంటి చిరునామాలు అడిగింది. అంతా ఆ చుట్టుపక్కలవాళ్ళే.

అందరిళ్ళకి వెళ్ళింది. కానీ సావిత్రి ఎక్కడికెళ్ళిందో ఎవరూ చెప్పలేకపోయారు. ఎప్పుడూ ఆ పిల్లలతోగానీ, వాళ్ళ తల్లిదండ్రులతోకానీ, తన వ్యక్తిగత విషయాలుగానీ, ఏం చేయదలచుకుందో చెప్పలేదు. అలాగే తన భర్త వివరాలు కూడా చెప్పలేదు ఎవరికీ.

తిరిగి హాస్టల్ కొచ్చేసరికి సహజ ఆఫీసుకు వెళ్ళే టైం అయింది. రాజేష్ కారిడార్ లో రాత్రి తనతో ఆడిన ఇద్దరూ కనిపిస్తే విష్ చేసి, 'గుడ్ బై' చెప్పాడు.

జయంతి తన గదిలోంచి బయటకు వచ్చింది. తలుపు మూయబోతూ రాజేష్‌ని చూసి ఆగి చెప్పింది.

"మాట - రా"

రాజేష్ జయంతి వెంట లోపలికి వెళ్ళాడు.

"ఓ! మీ గదిని బాగా డెకరేట్ చేశారే?" అడిగాడు గదిలోని వస్తువులని చూసి.

''అవును మరి'' చెప్పింది జయంతి.

అలమర తలుపు తెరిచి క్రీమ్ బిస్కెట్ పాకెట్ తీసి, రాజేష్ చేతిలో వుంచింది.

''థాంక్స్ ఆంటీ'' చెప్పాడు.

''వెల్‌కం. మళ్ళీ మా ఊరు వచ్చినప్పుడు మా హాస్టల్‌కి వస్తావుగా?'' అడిగింది జయంతి.

''తప్పకుండా. మీరు మా ఊరు వస్తే, మా ఇంటికి రావాలి మా తాతయ్య చాలా మంచివారు.''

''యు ఆర్ ఎ గుడ్ బోయ్'' వంగి రాజేష్ రెండు బుగ్గలమీద ముద్దు పెట్టుకుంది మృదువుగా.

''థాంక్స్ యూ. ఇట్ పీల్స్ గు....''మీట నొక్కినట్లు చటుక్కున ఆపేశాడు రాజేష్. ఆ పిల్లవాడి చూపు జయంతి మంచం పక్కనే వున్న చిన్న టేబుల్ మీద వున్న ఫ్రేం మీద పడింది. కేండిల్ హోల్డర్ పక్కనే వున్న ఆ ప్లాస్టిక్ ఫ్రేమ్‌లోని ఫోటో మీద నిలిచింది రాజేష్ దృష్టి. నిప్పు తొక్కినట్లుగా వులిక్కిపడ్డాడు.

''ఆంటీ'' పిల్చాడు భయంగా.

''ఆ అంకుల్ ఎవరు?'' అడిగాడు ఫోటో వంక వేలితో చూపిస్తూ.

జయంతి ఆ ఫోటోవంక చూసి చిన్నగా నిట్టూర్చింది.

''నీకు చెప్పినా అర్థంకాదు'' చెప్పింది.

''ఫర్వాలేదు ఆంటీ, అర్థంకాకపోయినా చెప్పండి. ఆయన మీకేమవుతారు?''

''పెళ్ళి చేసుకుంటే భర్త అయ్యేవారు.''

''మరి ఎప్పుడు మీ పెళ్ళి?''

తల అడ్డంగా తిప్పింది.

''ఇక కాదు.''

''ఏం?''

''ఆయన మోసగాడు కాబట్టి.''

''ఏం మోసం చేశాడు ఆంటీ?''

''ఆయన మోసం చేసి వుండకపోతే బహుశా నాకు నీలాంటి బాబు వుండేవాడు.''

''మీరు చెప్పింది నిజం ఆంటీ ఆయన మొహం చూస్తుంటే అచ్చం మోసగాడిలానే వుంది. పేరేమిటి ఆంటీ?'' అడిగాడు.

''సాంబశివరావు.''

''ఇంకా ఆ ఫోటో ఎందుకు అలా దాచుకున్నారు ఆంటీ?'' అడిగాడు రాజేష్.

వంగి రాజేష్ నుదుటిమీద ముద్దుపెట్టుకుంది.

''నీకు చెప్పినా అర్థంకాదు.''

''నాకెంతో విచారంగా వుంది'' చెప్పాడు రాజేష్ రహస్యంగా.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్ కదిలాక అడిగింది నీరజ హాస్టల్ నుంచి బయలుదేరినప్పటినుంచి ఎంతో మౌనంగా వున్న రాజేష్‌ని

''ఏమైంది?''

''నాకెంతో విచారంగా వుంది'' చెప్పాడు రాజేష్ కిటికీలోంచి బయటికి చూస్తూ

''దేనికి?''

కాసేపు ఆగి నెమ్మదిగా చెప్పాడు.

''ఏమో? నాకే తెలియదు.''

''ఐ యామ్ సో సేడ్'' చెప్పాడు రాజేష్ మళ్ళీ కాసేపాగి.

''దేనికి?'' రెట్టించింది నీరజ.

''నాకే తెలియదన్నాగా. ఎప్పుడూ సత్యమునే పలకమనే అమ్మ అబద్ధాలు చెపుతుందని నాకెప్పుడూ తెలియదు. 'అలవాటయితే దిగులు కూడా హాయిగానే వుంటుందిరా. వెళ్ళిరా' అని చెప్పింది నన్ను పంపబోయే ముందు. కానీ హాయిగా ఏంలేదు. బాధగా వుంది.''

''ఇంకా అలవాటయి వుండదు'' చెప్పింది నీరజ రాజేష్ భుజం మీద అనునయంగా చెయ్యివేసి.

''ఎప్పటికి అలవాటవుతుందో?'' జాలిగా చెప్పాడు రాజేష్.

''నువ్వు సెకండ్ స్టాండర్డ్ కదూ?''

''అవును''

''మరి అంత ఇంగ్లీష్ ఎలా వచ్చు నీకు?''

''అదా.. అమ్మ నేర్పించింది. రోజూ ఓ గంటసేపు నాకు ఇంగ్లీష్ నేర్పిస్తుంది. మేం ఆ గంటా ఇంగ్లీషులోనే మాట్లాడుకుంటాం. తప్పయినా సరే ఇంగ్లీష్ తప్ప తెలుగులో మాట్లాడకూడదు ఆ గంటసేపు.''

''మరి కొన్ని కొన్ని పదాలు నీకు రాకపోతే ఇంగ్లీషులో చెప్పటం కష్టం కదా?''

''నాకు చాలా పదాలు రావు. అలాంటప్పుడు అదేమిటో అర్థమయ్యేలాగా అమ్మకి ఇంగ్లీషులో వర్ణించి లేదా నటించి చెప్పాలి. 'గాలి'ని ఇంగ్లీషులో ఏమంటారో తెలియకపోతే ఇలా గట్టిగా ఊపిరి పీల్చి, ముక్కులోకి వెళ్ళేది అని, ఊపిరి వదిలి ఇలా బయటికి వచ్చేది అని చూపించాలన్నమాట.''

ఎంతమంది తల్లులకి తమ కొడుకుతో రోజుకి గంటసేపు అలా గడిపే ఓపిక, ఆసక్తి వుంటాయి అనుకుంది నీరజ మనసులో.

''మా అమ్మ నాకు ఇంగ్లీషులో రంగులని ఏమంటారో బాగా చిన్నప్పుడే నేర్పింది. రోజూ అన్నం తినబోయేముందు అన్నాన్ని చూపించి 'వైట్' అని, ఆవకాయని చూపించి 'రెడ్' అని ఇలా అన్ని రంగులు కంచం ముందే నేర్పించింది. ఇంట్లో వస్తువులని అంటే - చాప, కుర్చీ, కుంపటి ఇలాంటివన్నీ ఇంగ్లీషులో ఏమంటారో నేర్పించింది.''

నీరజ మౌనంగా తలూపింది రాజేష్ మాటలు వింటూ. తన తల్లి గురించి మాట్లాడుతుంటే రాజేష్‌కి ఆ కాసేపు దిగులుండదని 'శ్రద్ధ'ని తెచ్చి పెట్టుకుంది. కాసేపట్లోనే అది తెచ్చిపెట్టుకుంది కాక, సహజమైన శ్రద్ధగా మారింది.

రాజేష్ కిటికీలోంచి బయటకి చూస్తూ కాసేపు మౌనంగా వుండిపోయాడు. వాడు బయటకి చూడటంలేదని, గతాన్ని నెమరు వేసుకుంటున్నాడని నీరజ గ్రహించింది.

''మీకు చూపించటం మర్చేపోయాను పిన్నీ. మా వంటగదిలో నేను కూరల బొమ్మలన్నీ రంగురంగుల క్రేయాన్స్‌తో గీశాను. అమ్మవాటి పేర్లు ఇంగ్లీషులో వాటికింద రాసింది.''

''నువ్వే రాయొచ్చుగా?''

కనీకనపడకుండా నవ్వాడు.

''నాకు స్పెల్లింగులు రావుగా? అమ్మతో మాట్లాడి మాట్లాడి అలవాటయింది ఇంగ్లీషు. కానీ స్పెల్లింగులు నేర్పలేదు.''

కాస్సేపు నిశ్శబ్దం.

"నాకు రైల్లో వెళ్ళటం ఎంతో ఇష్టం" ఆగి కొన్ని క్షణాల తరువాత మరో వాక్యం జతచేశాడు "రైలింజనులో"

రాజేష్ తన దృష్టిని కిటికీ బయటనుంచి నీరజమీదకి మరల్చాడు. చిన్నగా నవ్వాడు. నీరజ కూడా నవ్వింది.

మళ్ళీ కాసేపు నిశ్శబ్దం.

"నాకు ఇప్పటికి ఫైర్ ఇంజన్‌లో వెళ్ళాలనుంటుంది" చెప్పింది నీరజ తన చిన్న తనపు కోరిక గుర్తుతెచ్చుకుని.

రాజేష్ మొహంలోకి కొత్త ఉత్సాహం ప్రవేశించింది అకస్మాత్తుగా.

"నాక్కూడా. అదేకాదు, రోజు స్కూలుకి రోడ్డింజనులో వెళ్ళాలనుంటుంది. మా ఇంటిముందు రోడ్డు వేసేటప్పుడు మా అమ్మ రోడ్డింజను అబ్బాయికి రూపాయి ఇచ్చి నన్ను అందులో ఎక్కించింది."

"ఎప్పుడైనా చిన్నపిల్లల రైలు ఎక్కావా?" అడిగింది నీరజ.

"లేదు. చిన్నపిల్లల రైలంటే"

"కంపార్టుమెంట్స్ ఎంతో చిన్నవిగా వుంటాయి."

"మీ ఊళ్ళో వుందా?"

"ఉంది. తీసికెళతాలే."

రైలు డోర్నకల్ జంక్షన్‌లో ఆగింది.

"కూల్ డ్రింక్స్ తాగుదామా?" అడిగింది నీరజ అవి అమ్మే కుర్రాడు ఆ కంపార్టుమెంట్‌లోకి ఎక్కడంతో.

"ఇఫ్ యూ డోంట్ మైండ్"

గోల్డ్‌స్పాట్ తాగి చెప్పాడు. "నాకోసం మీరు మొత్తం ఎంత ఖర్చు పెడుతున్నారో గుర్తుంచుకోండి. ఎక్కడైనా రాయండి గుర్తుండకపోతే. మా అమ్మ రాగానే యిచ్చేస్తుంది."

రైలు బయలుదేరాక రాజేష్ తన నిక్కర్ జేబులోంచి నాలుగు పండిన బాదం పళ్ళని బయటికి తీశాడు. తుడిచి ఒకటి నీరజకి యిచ్చి చెప్పాడు.

"తినండి బాగుంటుంది."

"మా ఇంట్లో బాదం చెట్టు వుంది. మీ ఇంట్లో బాదం చెట్టుకాయ కాని, పళ్ళు కాని లేవు. ఇవెప్పుడైనా తిన్నారా?"

తల వూపింది. నీరజ బాదం పండుని కొరికింది.

కొద్దికాలం అలవాటయ్యాక బాగా గేప్ వస్తే కొన్ని కొన్ని వాసనలు, కొన్ని కొన్ని దృశ్యాలు, కొన్ని కొన్ని రుచులు వెంటనే ఆ గేప్ తొలిగించి జ్ఞాపకాలని క్షణంలో కొన్ని పదుల సంవత్సరాల వెనక్కి తీసుకెళ్ళగలవు. మెదడులో నిద్రాణంగా వుండే సెల్స్‌ని మేల్కొలుపుతాయి. ఆ సమాచారానికి సంబంధించిన అనేక ఇతర విషయాలని మెదడు గుర్తుచేస్తుంది.

నీరజకి బాదంపండు రుచి సరిగ్గా అలాగే పనిచేసింది. మెదడులోని కొన్ని భాగాలు దీర్ఘనిద్రనుండి మేల్కొన్నట్లు ఫీల్ అయింది.

చిన్నప్పుడు, బాగా చిన్నప్పుడు తమ సందులోని ముస్లిం పిల్లవాడు నజరుద్దీన్ సందు చివరవున్న వాళ్ళ ఇంట్లోకి జొరబడి, బాదం చెట్టు ఎక్కి పళ్ళని కోసి వీధిలోకి విసిరేస్తుంటే, ఆ సందులోని పిల్లలంతా చేరి వాటిని ఎగబడి, పోటీపడి ఏరుకునేవారు.

ఓసారి వర్షం పడుతుంటే నజరుద్దీన్ ఒక్కడే బాదం చెట్టెక్కి పళ్ళుకోసి కిందకి గిరాటేశాడు. చాలాసేపటికి వర్షం తగ్గి పిల్లలు వీధిలో వస్తే, బాదం చెట్టు దిగి తను కోసిన వందల పళ్ళు చూపించాడు. ఆ రాత్రి తను అన్నం కూడా తినలేకపోయింది. బాదం పళ్ళతో కడుపు నిండటంతో.

నజరుద్దీన్‌కి చెట్లు ఎక్కడం సరదా. పద్నాలుగేళ్ళ అతనికి కుడికాలికి పోలియో. ఆ పోలియో కాలే అతనిచేత అలాంటి పని చేయించింది. తర్వాత తను యం.ఏలో చేరింది. మనిషికి ఏదైనా లోపం వుంటే ముఖ్యంగా అంగవైకల్యం, ఆ మనిషి మనస్తత్వం దానికి లోపం వుంటే ముఖ్యంగా అంగవైకల్యం, ఆ మనిషి మనస్తత్వం దానికి లోబడి తనమీద తనకి జాలిని కలగచేయటమో, లేదా తిరుగుబాటు ధోరణిలో అసలా వైపల్యమే లేనట్లు ఇతరులముందు ప్రవర్తించి, తన బలహీనతకి బానిస కాకూడదని ఇతరులముందు రుజువు చేసుకోవటమో జరుగుతుంది. సైకాలజీలో మనస్తత్వాన్ని..

నీరజ అప్పుడు గమనించింది. మళ్ళీ రాజేష్ కిటికీలోంచి మౌనంగా బయటికి చూస్తున్నాడు. మొహం నిండా దిగులు అలుముకుని వుంది.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in